


పెళ్ళి సందడి

పేపర్లో చదివేను. ఒక్క చిత్తూరు పట్టణంలోనే రోజుకి సగటున ఇరవై పెళ్ళిళ్ళు జరిగేయట. చిత్తూరు పట్టణం యావత్తూ కూడా జూన్ నెలారంభం నుంచి నిత్యకళ్యాణం పచ్చ తోరణంతో కళకళలాడి పోయిందన్నారు. పెద్ద పెద్ద వీధులూ, మూలనున్న సందులు ఎక్కడ చూసినా పెండ్లి కళ తాండవించిందని చెప్తున్నారు. ఒక్కో పురోహితుడూ రోజుకి నాలుగయిదు పెళ్ళిళ్ళు చేసివుంటాడు. కళ్యాణ మంటపాలు ఖాళీగా లేకపోవడంతో ఒక్కో మండపమ్మీద ఒకేసారి అయిదారు పెళ్ళిళ్ళు ఒకే పురోహితుని చేతిమీద జరిగివుండాలి. ఊళ్ళో వున్న కళ్యాణ మండపాలూ, సత్రాలూ చాల లేదుట. అంచేత సెలవుల పుణ్యమాని స్కూళ్ళు, హాస్టళ్ళను కూడా ఆక్రమంచేరని వార్త. స్థానిక పార్టీ కార్యాలయాలు సైతం కళ్యాణమండపా

లయ్యేయి. కాంగ్రెసు ఆఫీసులో జరిగిన పెళ్ళిళ్ళు కాంగ్రెసు పెళ్ళిళ్ళుగానూ జనతా ఆఫీసులో జనతా పెళ్ళిళ్ళుగానూ ముద్రలు వేసుకున్నాయేమో నాకు తెలీదు. అకస్మాత్తుగా పెరిగిన పెళ్ళిళ్ళ పుణ్యమాని పూలూ, కూరగాయలూ తమలపాకులూ, కొబ్బరికాయలూ వగైరా వాటి ధరలు కూడా అంత అకస్మాత్తుగా పెరిగి పోయేయని పేపరు వాళ్ళు రాసేరు. అయ్యో ఇది ఒక చిత్తూరు కథే కాదు. ఆ మాట కొస్తే ఆంధ్రదేశంలో ఏ వూరు తనిఖీ చేసినా యిదే విధంగా అల్లరి పడిపోతోంది. దేశంలో పెళ్ళి కావల్సినవాళ్ళు యింకా ఎంత మందున్నారోగాని ఈ పెళ్ళిళ్ళకో నమస్కారం.

నిరుడి కంటే ఈ ఏడాది పెళ్ళిళ్ళ సీజను హోరాహోరీగా వున్నట్టు నాకు వచ్చిన శుభలేఖలవల్ల తెలుసుకున్నాను. వారానికి డజను చొప్పున శుభలేఖలు వచ్చేయి. శుభలేఖ అందుకున్న ప్రతి పెళ్ళికీ వెళ్ళి తీరాలంటే ఆ భగవంతుడి కూడా సాధ్యపడదు. ఒకే రోజు ఒకే ముహూర్తానికి మూడు ఊళ్ళల్లో అయిదేసి పెళ్ళిళ్ళు జరిగేయి. ఏ పెళ్ళికి వెళ్ళి ఎవర్ని ఆశీర్వదించి తాంబూలం పుచ్చుకోవాలో, ఎవరి పెళ్ళికి టెలిగ్రాం కొట్టాలో తోచకఅల్లాడిపోయేను. స్వయంగా హాజరై అక్షింతలు చల్లితే అవతలి వాళ్ళు టెలిగ్రాం అందుకున్న వాళ్ళకంటే ఎక్కువగా సంతోషిస్తారు. నిజమే, అల్లాగనిచెప్పి ఒక మనిషి ఒకే కాలంలో ఎన్ని పెళ్ళిళ్ళకు హాజరవుతాడు? తనొక పెళ్ళికీ, ఇంటావిడ మరో పెళ్ళికి వంతులేసుకుని వెళ్ళినా, వెళ్ళవలసిన పెళ్ళిళ్ళు యింకా మిగిలిపోతాయి.

చాలా పెళ్ళిళ్ళకు హాజరు కాలేక పోవడంతో నేను చాలామంది కోపాగ్నికి మాడి, మసై పోయేను. మా మీద మీకున్న ఆదరాభిమానములు అర్థమయ్యేయంటూ నిష్ఠూరాలు పలుకుతూ ఉత్తరాలు రాశారు. ఈ మధ్య పోస్ట్‌మాన్ని చూస్తే చాలు గజగజ వణికి చచ్చిపోతున్నాను. అతను తెచ్చే వుత్తరాల్లో రెండు జాతులుంటున్నాయి: ఒక జాతి వుత్తరాలు కేవలం నిష్ఠూరాలకు కేటాయిస్తే మరోజాతి జరగబోయే పెళ్ళిళ్ళకు శుభలేఖలు. పోస్టు అందుకుంటున్నప్పుడు గుండెల్లో రైళ్ళు పరుగెట్టటం మామూలై పోయింది.

మే చివరి వారంలో ఏకంగా పాతిక శుభలేఖలు పోస్టులో వచ్చేయి. అన్నీ పెళ్ళిళ్ళు యించు మించు జూన్ నెల మొదటి పదిరోజులలోనే తగులుకున్నాయి. ఏ పెళ్ళికి వెళ్ళాలో ఏ పెళ్ళికి టెలిగ్రాం కొట్టాలో తేల్చుకునేందుకు అనేక రకాలుగా వడపోత పద్ధతి అవలంబించేను. చివరికి తప్పనిసరిగా హాజరు కావలసిన పెళ్ళిళ్ళు అరడజను వరకూ తేలేయి. అరడజనేకదా అనుకుంటే అందులో కావలిసినంత తిరకాసుంది. మూడు పెళ్ళిళ్ళు హైదరాబాద్ లోనే జరుగుతాయి గనుక బాధ లేదు. మరో మూడు గుంటూరు, విజయవాడ, బందర్లలో వున్నాయి. తేదీలు మాత్రం గొప్ప చిక్కు తెచ్చి పెట్టేయి. జూన్ ఒకటి హైదరాబాదులో పెళ్ళి. జూన్ రెండు గుంటూరు. జూన్ నాలుగు మళ్ళా హైదరాబాద్. జూన్ అయిదు విజయవాడ. జూన్ ఏడు అగైన్ హైదరాబాద్. జూన్ తొమ్మిది బందరు. జూన్ పదకొండు హైదరాబాద్.

పర్సుమీద దెబ్బ కొట్టడమంటే ఇదే. ఏ ఒక్క పెళ్ళీ అనుకూలంగా ఏర్పాటు కాలేదు. గుంటూరు పక్కనే విజయవాడ, బందరు. ఆ ప్రాంతాల్లో జరిగే పెళ్ళిళ్ళు వరసగా జరిగిపోతే వరసగా చూసేసి రావచ్చు. అట్లా వీలు కాకుండా ప్రతి పెళ్ళికి హైదరాబాద్ వచ్చి వెళ్ళేలా యిక్కడో మూడు పెళ్ళిళ్ళు తగులుకున్నాయి. ఢంకా పలాసులో సీక్వెన్సు లాగా దుంప తెంచి పారేసేయి. మూడు తడవలూ ఇట్నుంచీ అటు, అట్నుంచీ ఇటు తిరగడమంటే సామాన్యుడ్ని నేనేమై పోవాలి, పైగా ఈ పెళ్ళిళ్ళు పిల్లల సెలవలలోనే గురి చూసి వస్తాయి. పెళ్ళి మాట వినగానే పిల్లలకి ప్రాణాలు లేచి వస్తాయి. ఆ పేరు మీద ఎంచక్కా ఊరుగూరు చూసి రావచ్చని వాళ్ళ ముచ్చట. ఎగిరి గంతేస్తారు. వాళ్ళ దుస్తులూ, పాద రక్షలూ వగైరా హంగులన్నీ కొత్తవే కావాలి. ఇల్లాలు సరేసరి. ఫలానా పెళ్ళికి ఫలానా మీనాక్షమ్మ వస్తుంది గనుక ఆవిడకంటే డాబుసరిగా కనిపించాలనే సదుద్దేశ్యంతో ఖరీదైన చీరకి, జాకెట్టుకీ ఇండెంటు వేస్తుంది. ఒక పెళ్ళిలో వాడిన దుస్తులు మరో పెళ్ళిలో వాడకూడదని ఒట్టు పెట్టుకుంటుంది. ఇంటిల్లిపాదీ వాళ్ళ ముచ్చట్ల లిస్టుని హోరాహోరీగా పెంచేసుకుంటుంటే ఆ యజమాని కష్టాలు భగవంతునికే తెలిసేవి.

రాను పోను ఖర్చులూ, కానుకలూ ఎట్లాగూ తప్పవు. పెళ్ళిన ప్రతి పెళ్ళిలోనూ చీట్ల పేకొకటి గొప్ప అలంకారం. చీట్ల పేకలేని పెళ్ళి పెళ్ళి కానే కాదు. ఆ ఫీల్డులో దిగకూడ దనుకుంటూనే ఏమనుకుంటారోనన్న దిగుల్తో చెయ్యి కలపక తప్పింది కాదు. పేకాటకీ నాకూ బొత్తిగా పడి చావదు. అందులో నా చెయ్యి పరమ దవును. కవుంటుమీద కవుంటు పడి పోయి కుదేలై పోయేను. పేకాటలో ప్రామిసరీ నోట్లు రాసుకోక పోయినా చేసిన అప్పులు తీర్చకపోతే మనసు గుంజడం ఎక్కువవుతుంది. ఋణ విముక్తుణ్ని కావాలంటే ఎక్కడోచోట పెద్ద ఎత్తున అప్పు చెయ్యక తప్పదు. ఇప్పుడు ఆ వేటలోనే వున్నాను. వదిలేయండి.

బతుకుతున్న జనాభాలో ఎవ్వరూ పెళ్ళి చేసుకోరాదని విజ్ఞాపన చెయ్యలేను. ప్రతి మనిషీ మరో మనిషిని పెళ్ళాడవలసిందే. అయితే మా పెళ్ళికి బంధుమిత్రులతో హాజరై మదర్పిత చందన తాంబూలం స్వీక రించి మమ్మల్ని ఆనంద పరచండని ఆహ్వాన పత్రికలు అచ్చు వేయకూడదు. అథవా వేసినా ఆ పెళ్ళికి రాలేని మనుషుల్ని క్షమించాలేగాని కత్తులు నూర కూడదు. ఆ మాటకొస్తే పెళ్ళికి వేంచేసిన అతిథి దేవుళ్ళను ఆనందపరచడం కూడా అనుకున్నంత సుళువు కాదు. ఆ ఇబ్బందులేవో తర్వాత రాస్తాను. ఏతా వాతా ఈ పెళ్ళి చేసుకొనే పద్ధతిలో పెద్ద మార్పు రావాలని నేను మనసారా కోరుకుంటున్నాను.